## ఎన్నికల సామగ్రి పంపిణీ

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 26: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు పోలింగ్ సామగ్రిని ఆయా ఏరియాల్లో మంగళవారం కార్మిక శాఖ పంపిణీ చేసింది. బుధవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే ఈ ఎన్నికలకు సంస్థవ్యాప్తంగా 84 పోలింగ్ బూత్‌లు ఏర్పాటయ్యాయి.



ఎన్నికల సామగ్రిని సిబ్బందికి పంపిణీ చేస్తున్న అధికారులు

## సింగరేణిలో నేడు పోలింగ్

- సంస్థవ్యాప్తంగా 84 పోలింగ్ కేంద్రాలు
- 12 కౌంటింగ్ కేంద్రాలు



కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 26: సింగరేణి సంస్థలో బుధవారం జరిగే గుర్తింపు సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సింగరేణివ్యాప్తంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికలకు 11 ఏరియాల్లో 84 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 7.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. రాత్రి 7.00కు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అర్ధరాత్రి వరకు కొనసాగుతుంది. కౌంటింగ్‌కు సంస్థ వ్యాప్తంగా 12 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రీజియన్ వారీగా కొత్తగూడెం పరిధిలో కార్పొరేట్, కొత్తగూడెం ఏరియా, ఇల్లెందు, మణుగూరులలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు కార్మికులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు (పర్మినెంట్/టెంపరరీ) తీసుకెళ్లాలి. సంస్థవ్యాప్తంగా 12 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కొత్తగూడెం కార్పొరేట్‌లోని న్యూ కాన్ఫరెన్స్ హాల్ హెడ్డాఫీస్ (హైదరాబాద్‌లో సింగరేణి భవన్‌లో కౌంటింగ్ వేరుగా ఉంటుంది), ఏరియా ఆర్‌సీవోఏ క్లబ్ రుద్రంపూర్, ఇల్లెందు ఏరియాలో 24 ఇంక్లైన్ కమ్యూనిటీ హాల్‌లో, మణుగూరు ఏరియాలో పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### కొత్తగూడెం రీజియన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య

**కొత్తగూడెం కార్పొరేట్‌లో...**

| పోలింగ్ బూత్ నంబర్ | పోలింగ్ కేంద్రం | మొత్తం ఓటర్లు |
|---|---|---|
| 01 | హెడ్డాఫీస్ క్యాంటీన్ హాల్ | 382 |
| 02 | మెయిన్ ఆస్పత్రి కాన్ఫరెన్స్ హాల్ | 307 |
| 03 | మెయిన్ వర్క్‌షాప్ క్యాంటీన్ | 236 |
| 04 | సెంట్రల్ వర్క్‌షాప్ క్యాంటీన్ రూం | 178 |
| 05 | హైదరాబాద్ సింగరేణి భవన్ 3 ఫ్లోర్ | 88 |
| | | 1191 |

**కొత్తగూడెం ఏరియాలో...(కొత్తగూడెం, సత్తుపల్లిలో)**

| | | |
|---|---|---|
| 01 | పీవీకే 5 ఇంక్లైన్ ఏజెంట్ ఆఫీస్ | 567 |
| 02 | జీకేవోసీ క్యాంటీన్ హాల్ | 240 |
| 03 | జేవీఆర్‌వోసీ టూ రెస్ట్ హాల్ | 618 |
| 04 | జేవీఆర్ సీఎస్‌పీ కాన్ఫరెన్స్ హాల్ | 241 |
| 05 | కిష్టారం వీటీసీ హాల్ | 142 |
| 06 | ఏరియా వర్క్‌షాప్ | 523 |
| | | 2331 |

**ఇల్లెందు ఏరియాలో...**

| | | |
|---|---|---|
| 01 | జేకే ఓసీ ఓవర్‌మెన్స్ రూమ్ | 217 |
| 02 | కేవోసీ కాన్ఫరెన్స్ హాల్ | 122 |
| 03 | ఏఈపీఏటీపీ సెల్ | 274 |
| | | 613 |

**మణుగూరు ఏరియాలో...**

| | | |
|---|---|---|
| 01 | పీకేవోసీ కాన్ఫరెన్స్ హాల్ | 641 |
| 02 | పీకేవోసీ సర్వే ఆఫీస్ రూం | 489 |
| 03 | కేసీహెచ్‌పీ క్యాంటీన్ హాల్ | 426 |
| 04 | ఓసీ4 ఫిట్ ఆఫీస్ | 193 |
| 05 | కొండాపూర్ భూగర్భగని స్టోర్ రూం | 254 |
| 06 | సింగరేణి అతిథి గృహం డైనింగ్‌హాల్ | 260 |
| 07 | మణుగూరు ఓసీ సేఫ్టీ ఆఫీస్ రూం | 189 |
| | | 2452 |

## కార్మిక పక్షం.. టీబీజీకేఎస్

*టీబీజీకేఎస్.. సింగరేణి ప్రగతిలో కీలకపాత్ర*

*పోషించడమేగాక అనేక హక్కులు సాధించి నల్లసూర్యుల మనసు గెలుచుకున్నది. ఇప్పటికే 'గుర్తింపు' ఎన్నికల్లో రెండుసార్లు విజయం సాధించగా, ముచ్చటగా మూడోసారి గెలిచే లక్ష్యంతో ముందుకెళ్తున్నది. వారసత్వ ఉద్యోగాలు పోగొట్టిన జాతీయ సంఘాల వైఖరిని ఎండగడుతూనే.. తాము సాధించిన ఘనతను వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నది. గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సారథ్యంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, సౌకర్యాలే తిరిగి గెలిపిస్తాయన్న ధీమా నాయకుల్లో వ్యక్తమవుతున్నది. ఇక ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు చేసిందేమీ లేదని, బుధవారం జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు బీఆర్‌ఎస్ అనుబంధ సంఘమైన టీబీజీకేఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.*

- కేసీఆర్ సర్కారు సాయంతో కార్మికులకు అనేక ప్రయోజనాలు
- మరోసారి గెలిచేందుకు ఉవ్విళ్లూరుతున్న బీఆర్‌ఎస్ అనుబంధ సంఘం
- హ్యాట్రిక్‌కే లక్ష్యంగా ముందుకు..
- బాణం గుర్తుకు ఓటేసి గెలిపించాలని టీబీజీకేఎస్ నాయకుల విజ్ఞప్తి

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 26 : తెలంగాణ బొగ్గు కార్మిక సంఘం.. సింగరేణి చరిత్రలో లేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమేగాక లెక్కకు మించి హక్కులు సాధించి కార్మికుల మనసును గెలుచుకున్నది. కేసీఆర్ సర్కారు ప్రోత్సాహం, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సారథ్యంలో సంస్థ ప్రగతికి కృషి చేయడమేగాక కార్మికుల పక్షాన నిలిచి అనేక ప్రయోజనాలు సాధించింది. కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకొని ఒక్క పోరాటమైనా లేకుండా దేశ చరిత్రలో ఏ ప్రభుత్వ రంగ సంస్థ సాధించని అభివృద్ధి సాధించింది. నూతన హక్కులతో పాటు జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన హక్కులను కూడా సాధించి కార్మికుల గుండెల్లో గూడు కట్టుకున్నది.

### ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ చేసిందేమిటి?

1998, 2001లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన ఏఐటీయూసీ ఎలాంటి హక్కులు, ప్రయోజనాలు కల్పించిందో కార్మిక వర్గానికి తెలుసు. అందుకే 2003లో జరిగిన ఎన్నికల్లో ఆ సంఘాన్ని ఓడించి.. ఐఎన్‌టీయూసీకి పట్టం కట్టారు. ఐఎన్‌టీయూసీతోనైనా తమకు లాభం జరుగుతుందేమోనని ఆశించిన కార్మిక లోకానికి చివరికి నిరాశే మిగిలింది. ఇలా ఏఐటీయూసీ కాకపోతే.. ఐఎన్‌టీయూసీ.. ఐఎన్‌టీయూసీ కాకపోతే.. ఏఐటీయూసీ గెలుచుకుంటూ వచ్చాయి. 12 ఏళ్లు గుర్తింపు కార్మిక సంఘాలుగా ఉండి కార్మికులకు చేసిందేమీ లేకపోగా.. వారసత్వ ఉద్యోగాలు ఊడగొట్టింది. ఈ విషయాన్ని కార్మిక కుటుంబాలు ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నాయి. అలాంటి వారికి ఓట్లు అడిగే హక్కు లేదని, ఈ ఎన్నికల్లోనూ టీబీజీకేఎస్‌కే పట్టం కట్టి.. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

### హ్యాట్రిక్‌పై టీబీజీకేఎస్ దృష్టి..

2012 అక్టోబర్ 5న.. జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మిక వర్గం టీబీజీకేఎస్‌ను ఆదరించింది. 23,311 ఓట్లు అందించి గుర్తింపు కార్మిక సంఘంగా టీబీజీకేఎస్‌ను నిలబెట్టింది. కేసీఆర్ సర్కారు సహకారంతో సింగరేణి చరిత్రలో లేనివిధంగా అనేక హక్కులు సాధించి కార్మికుల చేత ప్రశంసలు అందుకున్నది.

2017లో జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లోనూ విజయం సాధించింది. 23,845 ఓట్లు సాధించింది. కార్మికులు గత ఎన్నికలకంటే 534 ఎక్కువ ఓట్లతో గెలిపించారు. ఇక ఈ నెల 27న నిర్వహించనున్న గుర్తింపు ఎన్నికల్లోనూ మరోసారి గెలిచేందుకు టీబీజీకేఎస్ ఉవ్విళ్లూరుతున్నది. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత సూచనలతో నాయకులు హ్యాట్రిక్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

### టీబీజీకేఎస్ గెలిస్తే అమలు చేసే హామీలు..

- కార్మికులకు సొంతింటి కల
- గృహ రుణాలు రూ. 20 లక్షలకు పెంపు
- అలవెన్స్‌లపై ఐటీ రద్దుకు హామీ
- డిపెండెంట్ ఉద్యోగానికి వయసు పరిమితి 35 నుంచి 40కు పెంపు.
- కార్మికుల పేర్లలో తప్పుల సవరణ
- విజిలెన్స్ వల్ల పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్లకు నిర్ణీత సమయంలో ఉద్యోగాలు
- కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకం
- సింగరేణి ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్ల ఏర్పాటు
- సింగరేణి కార్మికుల నివాసాలకు రక్షిత మంచినీటి (ఆర్‌ఓ)ప్లాంట్ల దారా సరఫరా
- బొగ్గు గనుల వేలంలో సింగరేణి యాజమాన్యం కూడా పాల్గొనేలా కృషి
- ఫ్లైడే పీహెచ్‌డీ విషయంలో ఎన్-1 విధానం రద్దు
- మైనింగ్ స్టాఫ్, ఈఅండ్‌ఎం సూపర్‌వైజర్స్, ట్రేడ్స్‌మెన్, ఈపీ ఆపరేటర్స్, ఎంవీ డ్రైవర్స్, మెడికల్ అన్‌ఫిట్ అయితే వారికి సర్ఫేస్‌లో సూటబుల్ ఉద్యోగం.

### సింగరేణి చరిత్రలో లేని విధంగా హక్కులు సాధించిన ఘనత



ఎస్సార్పీ- 3 గనిలో టీబీజీకేఎస్ నాయకుల ప్రచారం (ఫైల్)

### టీబీజీకేఎస్ సాధించిన హక్కులు ఇవీ..

- జాతీయ కార్మిక సంఘాలు కాలరాసిన వారసత్వపు ఉద్యోగాల హక్కును కారుణ్యం ద్వారా తీసుకువచ్చింది. 16,000 మందికి ఉద్యోగాలిప్పించింది.
- పెండింగ్‌లో ఉన్న 600 మంది డిపెండెంట్‌లకు తిరిగి ఉద్యోగాలు. ● ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ల ద్వారా 4200 మందికి కొత్తగా ఉద్యోగాలు. ● 600 మంది డిస్మిస్డ్ కార్మికులకు తిరిగి ఉద్యోగాలు. ● వికలాంగులకు సర్ఫేస్ ఉద్యోగాలు. ● లాభాల వాటా 16 శాతం నుంచి 32 శాతానికి పెంపు. సకలజనుల సమ్మె కాలపు వేతనం పంపిణీ.
- తెలంగాణ ఇంక్రిమెంట్ ● కార్మిక కుటుంబాలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం, రూ.10 లక్షల గృహ రుణం, వడ్డీ చెల్లింపు.
- ఉద్యోగం వద్దనుకుంటే డిపెండెంట్‌లకు రూ. 25 లక్షల చెల్లింపు (కోలిండియాలో లేదు) ● ఐఐటీ, ఐఐఎంలలో సీటు సాధించిన కార్మికుల పిల్లలకు ట్యూషన్ ఫీజు, రీయింబర్స్‌మెంట్. ● సొంత ఇల్లు ఉండే కార్మికులకు 100 యూనిట్ల విద్యుత్ చార్జీల చెల్లింపు.
- కార్మికుల కమ్యూనిటీ హాళ్లకు ఏసీ సౌకర్యం
- గని ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబానికి రూ. 20 లక్షల మ్యాచింగ్ గ్రాంట్.
- విధులు, డ్యూటీలో సహజ మరణం పొందిన కార్మిక కుటుంబానికి రూ.20 లక్షల మ్యాచింగ్ గ్రాంట్.
- రూ. 175 కోట్ల వృత్తి పన్ను బకాయిలు పర్మినెంటుగా రద్దు.
- మహిళలకు ప్రసూతి సెలవులు ● పీఎంఈ మస్టర్ కల్పన.
- కోలిండియాలో లేనివిధంగా సింగరేణిలో మహిళలకు డిపెండెంట్ ఉద్యోగాల్లో అవకాశం ● పెళ్లయిన, విడాకులైన, వితంతువు, ఒంటరి మహిళ కూతురు, వితంతువు కోడలుకు కూడా డిపెండెంట్ ఉద్యోగాలకు అవకాశం.
- మహిళా కార్మికులకు చైల్డ్ కేర్ లీవ్ రెండేళ్లు.
- సింగరేణి కార్మికుల ఆరోగ్యం, పిల్లల భవిష్యత్తు కోసం రామగుండంలో సింగరేణి మెడికల్ కళాశాల ఏర్పాటు. కార్మికుల పిల్లలకు 5 శాతం రిజర్వేషన్.
- సింగరేణి ఏరియా ఆసుపత్రి, కొత్తగూడెం కార్పొరేట్ ఆసుపత్రిలో సిటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ ఏర్పాటు.
- 2014 మార్చి 31 వరకు వేచి ఉన్న 3200 మంది డిపెండెంటులందరికీ ఒకేసారి ఉద్యోగాలు
- బేసిక్‌పై 1 శాతం విద్యుత్ చార్జీలు రద్దు చేసి ఏసీ పెట్టుకోవడానికి అనుమతి, ఉచిత విద్యుత్.
- 190/240 మస్టర్‌లు నిండిన సంవత్సరంలోపే బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్‌గా క్రమబద్ధీకరణ.
- సంస్థలో ఇక ముందు డబుల్ బెడ్‌రూమ్ క్వార్టర్స్ నిర్మించాలని నిర్ణయం. భూపాలపల్లిలో 994, సత్తుపల్లిలో 440 డబుల్ బెడ్ రూమ్ క్వార్టర్ల నిర్మాణం.
- సింగరేణి వ్యాప్తంగా ఏసీ ఫంక్షన్ హాళ్లు ఏర్పాటు.
- తెలంగాణ సకళజనుల సమ్మె కాలపు వేతనాలు, ఇంక్రిమెంట్‌ల అందజేత.

## ఉమ్మడి ఖమ్మం జిల్లాను సమస్యల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

**రెండు జిల్లాల ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, చిత్రంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి, భద్రాద్రి కలెక్టర్ ఆల

ఖమ్మం, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాను సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ, రెండు జిల్లాల ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. 'ప్రజాపాలన' అమలుపై మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని కలెక్టరేట్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేయడం ప్రారంభించిందన్నారు. దీనిలో భాగంగానే 28 నుంచి జనవరి 6 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. రెండు జిల్లాల్లో విస్తరణకు వీలున్న రహదారులను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా ఎన్నికల సమయలో హామీలు అమలు చేసి తీరుతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీల స్కీములకు క్యాబినెట్ మీటింగ్‌లో చట్టబద్ధత కల్పించామన్నారు. ఆర్థిక పరమైన సమస్యలను అధిగమించి స్కీములను అమలు చేస్తామన్నారు. ఈనెల 28 నుంచి 'ప్రజాపాలన' పేరుతో గ్రామ గ్రామాన గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ప్రజల నుంచి దరఖాస్తు స్వీకరించి వారికి రశీదులు అందిస్తామన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి మొక్కుబడిగా దరఖాస్తులు తీసుకోవడం లేదని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలో నాగపూర్ - అమరావతి వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే, ఖమ్మం -రాజమండ్రి హైవే, కోదాడ - కురవి హైవే పనులను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగూడెం -వలిగొండ జాతీయ రహదారి పనులు పూర్తి చేసేందుకు సహకారం అందించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వెంకటరెడ్డిని ఆయన కోరారు. సమావేశంలోభద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి న్నారు.

## వైభవంగా రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, డిసెంబర్ 26 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో మంగళవారం సీతారాములకు నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి విశ్వక్సేన ఆరాధన తదితర కార్యక్రమాలతో ముగించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలను, శేష వస్త్రాలను అందజేశారు.



రామయ్యకు నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

## పెద్దమ్మతల్లి యాగశాలలో చండీహోమం

పాల్వంచ రూరల్, డిశంబర్ 26: మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయ యాగశాలలో మంగళవారం చండీహోమాన్ని వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం తదితర ప్రాంతాల నుంచి 18 మంది జంటలు పాల్గొన్నాయి. వారికి అర్చకులు ఆశీర్వచనం పలికి అమ్మవారి శేష, వస్త్ర ప్రసాదాలను అందించారు. ఈవో రజనీ కుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం తదితరులు పాల్గొన్నారు.



చండీహోమంలో పాల్గొన్న భక్తులు



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

## ఆరు గ్యారంటీల అమలుకే ప్రజాపాలన

- రేపటి నుంచి జనవరి 6 వరకు గ్రామాలు, వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ
- ప్రజల సమస్యలను మంత్రుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారుల సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి
- గ్రామసభల షెడ్యూల్‌ను ప్రకటించాలి: మంత్రులు తుమ్మల, పొంగులేటి



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

మామిళ్లగూడెం, డిసెంబర్ 26: ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమ అమలుకు చర్యలు చేపట్టిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఇందుకోసం ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఖమ్మం నూతన కలెక్టరేట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అమలుజేసే బాధ్యత అధికారులపై ఉందని, పేదల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తుకు స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలని, క్లిష్టమైన సమస్యలుంటే మంత్రుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తేవాలని సూచించారు. ప్రజాపాలన ద్వారా ఒక్కో సమస్యనూ పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పించామని, ఇది మహిళలకు ఎంతో ఉపయోగంగా ఉంటోందని అన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితి కూడా పెంచి అమలు చేస్తున్నామని అన్నారు. 100 రోజుల్లోపే హామీలన్నీ అమలు చేస్తామన్నారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో అధికారులు టీమ్‌గా విధులు నిర్వర్తించాలని, రోజుకు 18 గంటలు కష్టపడాలని సూచించారు.

### గ్రామసభల షెడ్యూల్‌ను ప్రకటించాలి: మంత్రులు తుమ్మల, పొంగులేటి

అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలతోపాటు ఇతర సంక్షేమ పథకాలనూ అమలు చేస్తామని అన్నారు. ప్రజాపాలనపై అధికారులు స్పష్టత రావాలని, కార్యక్రమం బాగా జరిగిందనే కీర్తి పొందాలని సూచించారు. అనంతరం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు అన్ని పని దినాల్లో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. గ్రామసభల షెడ్యూల్‌ను ప్రజలకు ముందస్తుగా తెలియజేయాలని ఆదేశించారు. ప్రతి 100 మందికి ఒక కౌంటర్, నీడ కోసం షామియానా ఏర్పాటు చేయాలని, తాగునీరు సహా ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

### రెండు షిఫ్టుల్లో సభలు నిర్వహిస్తాం: భద్రాద్రి కలెక్టర్

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ.. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాంయత్రం 6 గంటల వరకు రెండు షిఫ్టుల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఖమ్మం అదనపు కలెక్టర్ బీ.సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో 59 బృందాలు రెండు షిఫ్టుల్లో పని చేస్తాయని వివరించారు. సత్తుపల్లి, భద్రాచలం ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, భద్రాద్రి అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, ఉమ్మడి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలకు షెడ్యూల్ రూపొందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ డాక్టర్ వినీత్, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

- నేడు ఇంటింటికీ దరఖాస్తులు అందించాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సభలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు షెడ్యూల్ తయారు చేయాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామ, వార్డు సభల నిర్వహణపై పంచాయతీరాజ్ నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో మంగళవారం ఖమ్మం ఐడీవోసీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, చేయూత పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. ఇందుకోసం పంచాయతీలు, మున్సిపాలిటీల్లో బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. 27వ తేదీ వరకు అన్ని గృహాలకు ప్రజాపాలన దరఖాస్తులు అందజేయాలన్నారు. లబ్ధిదారులు ముందుగానే దరఖాస్తును పూర్తిచేసి గ్రామ/వార్డు సభకు వచ్చేలా చూడాలని చెప్పారు. దరఖాస్తు నింపేందుకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటర్లలో మహిళలు, వయోవృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ డాక్టర్ వినీత్, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఖమ్మం స్థానిక సంస్థల కలెక్టర్ సత్యప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి, కొత్తగూడెం అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూధన్ రాజు, జడ్పీ సీఈవో విద్యాలత, డీపీవో రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలుకు ప్రజల పక్షాన పోరు

**మాజీ ఎమ్మెల్యే హరిప్రియ**



కౌన్సిలర్‌లతో మాట్లాడుతున్న హరిప్రియ

ఇల్లెందు, డిసెంబర్ 26: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు ప్రజల పక్షాన పోరాడుదామని బీఆర్‌ఎస్ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. ఎల్‌బీఎస్ నగర్‌లోని 3వ వార్డు కౌన్సిలర్ ఇంట్లో మంగళవారం పార్టీ కార్యకర్తలు, కౌన్సిలర్ల ఆమె సమావేశమయ్యారు. అప్పుల పేరుతో ఆరు గ్యారెంటీల అమలు బాధ్యతను తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులను మాత్రమే చూపిస్తున్నదని, కేసీఆర్ ప్రభుత్వం సృష్టించిన అస్తులను వెల్లడించడం లేదని విమర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాషా, కౌన్సిలర్లు కొక్కు నాగేశ్వరరావు, వాంకుడోత్ తారా, లలిత శారద, చీమల సుజాత, కొడకంచి పద్మ, నాయకులు శీలం రమేష్, దాస్యం ప్రమోద్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.